కథ

# కనువిప్పు

**"అనూ త్వరగా రెడీ అవు. ఊర్వశి థియేటర్‌లో నీ అభిమాన హీరో సినిమా వచ్చింది వెళదాం" ఆఫీసు నుంచి వస్తూనే హడావిడిగా చెప్పులు వదులుతూ అన్నాడు ప్రశాంత్. భర్త వంక ఓసారి నిస్తేజంగా చూసింది అనుపమ.**

''ఏమిటి అలా డల్‌గా వున్నావు? ఏం అనూ ఒంట్లో బాగాలేదా'' దగ్గరగా వచ్చి ఆప్యాయంగా అడిగిన భర్తకి సమాధానం చెప్పకుండా టీ తయారుచేయడానికి వంటింట్లోకి నడిచింది అనుపమ.

''నీ పద్ధతి నాకేం నచ్చలేదు అనూ- మన పెళ్లయిన దగ్గర్నుంచీ చూస్తున్నాను. ఎప్పుడూ కిలకిలా నవ్వవు. ఎందుకొచ్చిన జీవితం అన్నట్టు పరధ్యానంగా వుంటావు. ఏ పని చేసినా యాంత్రికంగా చేస్తావు. ఒకవేళ నీకు నచ్చని పనులు నేనేమైనా చేస్తే ఆ సంగతి మొహం మీదే చెప్పేయి. మార్చుకోడానికి ప్రయత్నిస్తాను'' భార్య వెనకాలే వంటింట్లోకి వస్తూ అన్నాడు ప్రశాంత్.

'పద్ధతులు మార్చుకోగలరు, రూపాన్ని మార్చుకుని నన్ను మెప్పించగలరా?' మనసులోనే అనుకుంది అనుపమ.

''మౌనం సమస్యలని పెంచుతుంది అనూ. నీ మనసులో ఏముందో తెలుసుకుని నీకిష్టమైనట్టు మసలడానికి నాకు మనసు భాష రాదు. నువ్వు పెదవి విప్పితే కానీ నీ బాధ నాకెలా తెలుస్తుంది?'' విసుగ్గా అన్నాడు ప్రశాంత్.

'మౌనానికి మాటలొచ్చి భావాలు బయటపడితే ప్రళయాలే సంభవిస్తాయి' భర్తకి టీకప్పు అందిస్తూ అనుకుంది అనుపమ.

''అనూ. నువ్విలా డల్‌గా ఉంటే నాకు ఏదోలా వుంటుంది. కొత్తగా పెళ్లయిన వాళ్లం. మన మధ్య ఈ యాంత్రికత ఎందుకూ? నువ్వెప్పుడూ నవ్వుతూ సరదాగా ఉండడమే నాక్కావాల్సింది. అందుకు నన్నేం చేయమంటావో చెప్పు హేపీగా చేస్తాను'' అంటున్న భర్త వంక ఓసారి చూసి తల దించుకుంది అనుపమ.

''అనూ ఎందుకంత నిస్పృహ.. త్వరగా రెడీ అవు. సినిమా చూసి అట్నుంచి అటే హోటల్‌కెళ్లి భోంచేసి వద్దాం'' లాలనగా అన్నాడు ప్రశాంత్.

''నాకు తలనెప్పిగా ఉంది మీరు వెళ్లి రండి'' గొంతు పెగల్చుకుంటూ అన్నది అనుపమ.

''అదా సంగతి! ఐతే సినిమా వద్దులే. ఇంట్లోనే కూర్చుని స్వీట్ నథింగ్స్ చెప్పుకుంటూ హ్యేపీగా గడిపేద్దాం''

'నా మొహానికి అదొక్కటే తక్కువ' మనసులో అనుకుంటూ ''నాకోసం మీరు సినిమా మానుకోవడం ఎందుకూ? మీరు ఒక్కరూ వెళ్లి చూసి రండి'' అన్నది అనుపమ.

''పిచ్చి అనూ! నువ్వు పక్కన లేకుండా సినిమా ఎంజాయ్ చెయ్యగలనా నేను''

''ఏం.. ఎంతమంది మొగుళ్లు పెళ్లాం పిల్లల్ని ఇంట్లో వదిలేసి ఫ్రెండ్స్‌తో సినిమాలకెళ్లడం లేదు? అంతగా ఒక్కరూ వెళ్లడానికి బోరైతే ఏ ఫ్రెండ్‌నో వెంటబెట్టుకెళ్లండి''

''ఎవరో కొందరు అలా వెళితే వెళ్లవచ్చేమో కానీ నాకు మాత్రం సినిమా అయినా షికారు అయినా నా భార్యతోటే. అసలు ఓ మాట చెప్పనా! ఈ సినిమా ప్రోగ్రాం పెట్టింది నీ కోసమే. అలాంటప్పుడు ఇంకెవరితోనో సినిమాకెళ్లడం ఏమిటి? నీకు ఏ కష్టం కలగకుండా ఎప్పుడూ హ్యేపీగా ఉంచడం భర్తగా నా బాధ్యత కాదా?'' అన్నాడు ప్రశాంత్.

భర్తకి తన మీదున్న ప్రేమకి ఒక్క క్షణం పొంగిపోయింది అనుపమ. దేవుడు నిజంగా చాలా టక్కరివాడు. కాకపోతే ఇంత మంచి మనసిచ్చిన తన భర్తకి మంచి రంగూ, రూపు ఇస్తే ఏం పోయింది ఆ దేవుడికి అనుకుంది.

★ ★ ★

అనుపమకి భర్తతో ఎక్కడికి వెళ్లడమూ ఇష్టం వుండదు. అందుకు భర్త రూపమే కారణం. ప్రశాంత్ నల్లగా పొట్టిగా వుంటాడు. పైగా బట్టతల. అనుపమ పచ్చటి పసిమి రంగులో చక్కని శరీర సౌష్టవంతో బొమ్మలా వుంటుంది. ప్రశాంత్ తనకి తగిన జోడు కాదని ఆమె నమ్మకం. భర్తతో కలిసి సినిమాలకీ షికార్లకీ వెళ్లాలంటే అందరూ తమ జంటని చూసి నవ్వుతారని ఆమె భయం. తన పక్కన భర్త నిలబడితే ఏదో తెలియని ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో బాధపడుతుంది అనుపమ. అందుకే భర్తతో కలిసి ఏ ఫంక్షన్‌కీ అటెండ్ అవదు అనుపమ.

అతి సాధారణమైన మధ్య తరగతి కుటుంబంలో ముగ్గురు అక్కల తర్వాత పుట్టింది అనుపమ. ఆమె తండ్రి గవర్నమెంట్ ఆఫీసులో ఓ గుమస్తా. తన సర్వీసులో వుండగానే ఇద్దరు ఆడపిల్లలకి పెళ్లి చేసాడు. రిటైరైనాక వచ్చిన పి.ఎఫ్.డబ్బులతో కొంత ఖర్చుచేసి మూడో పిల్ల పెళ్లిచేసి మిగిలిన డబ్బుతో ఊరుచివర చౌకగా ఉన్న స్థలం కొని రెండు గదుల రేకుల ఇల్లు వేయించాడు. వచ్చిన పెన్షను డబ్బులు ఏ నెలకానెల ఇంటి అవసరాలకీ, అల్లుళ్లని పిలిచి పండక్కి బట్టలు పెట్టడానికీ, కూతుళ్ల పురుళ్లూ పుణ్యాలకే చాలక ఇక్కడా అక్కడా అప్పు చేయాల్సి వచ్చేది. ఇలాంటి పరిస్థితిలో అనుపమ పెళ్లి చేయడం ఆయనకి తలకిమించిన భారమే అయింది.

కదిలే కాలం ఎన్నో చిత్రాలు చేస్తుంది. అనుపమ దురదృష్టమో ఆమె తల్లిదండ్రుల అదృష్టమో కానీ వారికి దూరపు బంధువైన ప్రశాంత్ తలవని తలంపుగా అనుపమని చూడడం తటస్థించింది. వీళ్ల ఇంటి పరిస్థితి చూసి కానీ కట్నం లేకుండా అనుపమని చేసుకుంటానని ముందుకొచ్చాడు. అనుపమ తల్లిదండ్రుల ఆనందానికి అంతులేదు. గంతకు తగ్గ బొంత లాంటి సంబంధమైనా చేయగలమా అనుకున్న వారికి బాంక్ ఆఫీసర్ అయిన ప్రశాంత్ తమ కూతుర్ని పెళ్లి చేసుకుంటాననడమే గొప్ప వరం అనిపించింది. అతడి గురించి కూతురి అభిప్రాయం కనుక్కోవాలనే ఆలోచనే రాలేదు వారికి. ఫలితంగా అనుపమ పెళ్లి ఆమె ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా ప్రశాంత్‌తో జరిగిపోయింది.

★ ★ ★


భర్త ఆఫీసుకి వెళ్లిపోయాక ఇంటి పని ముగించుకుని టీవీ చూస్తూ కూర్చుంది అనుపమ.

అదేపనిగా కాలింగ్ బెల్ మోగుతూంటే ఎవరొచ్చారబ్బా అనుకుంటూ తలుపు తీసిన అనుపమ ఎదురుగా తన స్నేహితురాలు స్పందనని చూసి ఆశ్చర్యపోయింది.

''ఏమిటే అలా చూస్తున్నావ్? గుర్తుపట్టలేదా నన్ను'' అన్న స్పందన మాటలకి ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ ''నిన్నెలా మర్చిపోతానే బాబూ... ఎలా వచ్చావు మా ఇంటికి అసలు? నేనిక్కడ వుంటున్నానని ఎలా తెలుసుకున్నావు? ఇంతకీ ఒకర్తివే వచ్చావా?'' అన్నది అనుపమ.

''ఇంక ఆపుతావా తల్లీ నీ ప్రశ్నల వర్షం. లోపలికొచ్చాక నీ ప్రశ్నలకి సమాధానం ఇస్తా కానీ ముందు గుమ్మానికి అడ్డులే. వెనకాల మా శ్రీవారు కూడా వస్తున్నారు'' అన్న స్పందన మాటలకి గేటువైపు దృష్టి సారించింది అనుపమ.

ఆటో అతనికి డబ్బులిచ్చి గేటుతీసి లోపలికి వస్తున్న స్పందన భర్త రాజేష్‌ని చూసింది అను



పమ. సుమారు ఆరడుగుల ఎత్తు, ఆకర్షణీయమైన రూపంతో బట్టల కంపెనీ మోడల్‌లా వున్నాడు. స్పందన అదృష్టానికి ఒక్క క్షణం అసూయపడింది అనుపమ.

''ఈయన మావారు రాజేష్'' అనుపమకి పరిచయం చేసింది స్పందన.

''నమస్తే'' అంటూ చేతులు జోడించి అప్రయత్నంగా అతని వంక చూసిన అనుపమకి ఎందుకో అతని చూపులు ఏదోలా అనిపించాయి. అతడు తనని పట్టిపట్టి చూస్తున్నట్టు అర్థమైన అనుపమకి ఒళ్లంతా కంపరంగా అనిపించింది. ఆ తర్వాత అతనికి టిఫిన్ ప్లేటు ఇచ్చినప్పుడూ, మంచి నీళ్లగ్లాసు అందించినప్పుడు అతడు కావాలనే తన చేతివేళ్లను స్పృశించినట్టు అనిపించి అతని ప్రవర్తనని మనసులోనే అసహ్యించుకుంది అనుపమ. టిఫిన్లు, టీలూ అయ్యాక రాజేష్ డ్రాయింగ్ రూంలో మేగజైన్స్‌తో, టీవీతో కాలక్షేపం చేస్తే స్నేహితురాళ్లిద్దరూ బెడ్‌రూంలో కూర్చుని కబుర్లు చెప్పుకోవడంలో మునిగిపోయారు.

''ఇంతకీ చెప్పవే ఎలా కనుక్కున్నావ్ మా ఇల్లు''

''అదా? గిరిజ లేదూ. అది ఈమధ్య ఓసారి బజార్లో కనపడింది. అదే చెప్పింది నీ గురించి. మావారికి ఈ ఊరు ట్రాన్స్‌ఫరై రెండేళ్లయింది. చూశావా స్నేహితులం అయివుండీ ఒకే ఊళ్లో రెండేళ్లబట్టి వుంటూ ఒకరి గురించి ఒకరం తెలీకుండా గడిపేశాం ఎంత చిత్రమో'' అన్నది స్పందన.

''నిజమే స్పందూ! జీవితంలో ఎన్నో చిత్రాలు మన ప్రమేయం లేకుండానే జరిగిపోతాయి'' నిట్టూరుస్తూ అన్నది అనుపమ.

''అదృష్టవంతురాలివి. కట్నం లేకుండా బాంక్ ఆఫీసర్ని పెళ్లి చేసుకున్నావు'' అన్నది స్పందన.

దిగులుగా నవ్వింది అనుపమ.

''ఇంతకీ ఎన్ని గంటలకొస్తారే మీవారు ఇంటికి? పనిలో పని అన్నయ్యగార్ని కూడా పరిచయం చేసేసుకుని వెళతాము మేము'' అన్న స్పందన మాటలకి ఉలిక్కిపడింది అనుపమ. ఇవాళ ఆయన త్వరగా ఇంటికి రాకపోతే బాగుండు అనుకుంది. అందంగా, రాకుమారుడిగా ఉన్న స్పందన భర్త-ప్రశాంత్ రూపాన్ని చూసి తప్పకుండా నవ్వుకుంటాడు. స్పందన మాత్రం- తన గుమ్మందాటి కాలు బయటకి పెట్టగానే 'కాకిముక్కుకి దొండపండు' అని తప్పకుండా అనుకుంటుంది తమ జంటని చూసి. స్పందన సంగతి తనకి తెలియనిదేముంది? కాలేజీ రోజుల్లో అబ్బాయిలకి ఎన్ని పేర్లు పెట్టేదనీ! చూసిన ప్రతి వాడినీ వారిలో వుండే ఏ కాస్త శారీరక లోపమో పట్టుకుని ఆ లోపాన్నే హైలైట్ చేస్తూ నిక్ నేమ్ పెట్టి పిలిచేది. పొడుగు ముక్కు ఉంటే గద్ద ముక్కనీ, చిన్న ముక్కు ఉంటే చప్పిడి ముక్కు అనీ పిలిచేది. పొడవుగా వుంటే గెడకర్ర అని సంబోధించేది. అలాంటి స్పందన తన భర్తని మాత్రం వదులుతుందా

**ఆదుర్తి బాల**

ఏమిటి? అనుకుంది అనుపమ.

''ఏయ్ ఏమిటి అనూ అలా పరధ్యానంలోకి వెళ్లిపోయావు, ఎదురుగా నేనున్నాను తల్లీ''

''ఏం లేదే స్పందూ! కాలేజీ రోజుల్లో అబ్బాయిలకి నిక్‌నేమ్స్ పెట్టి ఏడిపించేదానివిగా. అది గుర్తొచ్చింది. నీ అదృష్టం బాగుంది ఏ వంకా పెట్టలేనంత అందమైన భర్త దొరికాడు'' అన్నది అనుపమ.

''నీకింకా అవన్నీ గుర్తున్నాయా అనూ. కాలేజీ రోజులే వేరు. అసలు ఆ జీవితం, ఆ హాపీనెస్ మళ్లీ రాదు మనకి. బాధ్యతలు తెలియని టీనేజ్‌లో అపరిపక్వమైన ఆలోచనలు బాహ్యసౌందర్యానికే విలువనిస్తాయి. కానీ కొంత వయసు వచ్చాక ఆలోచనలు పరిపక్వమయ్యాక కానీ తెలీదు అంతఃసౌందర్యం ఎంత గొప్పదో?'' అన్నది స్పందన.

''ఏమిటే జీవితాన్ని కాచి వడబోసినట్టు మాట్లాడుతున్నావ్'' అన్నది అనుపమ.

''జీవిత కాలానికి సరిపడ అనుభవాన్ని మూటగట్టుకున్నాగా మరి. ఇంతకీ అందరికీ నిక్‌నేమ్స్ పెట్టి పిలిచిన నేను మావార్ని కూడా ఓ నిక్‌నేమ్‌తో పిలుచుకుంటా. అదేమిటో తెలుసా ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య'' నవ్వుతూ అంది స్పందన. ఆమె పెదవులు నవ్వుతున్నా ఆమె కళ్లల్లోని నీటిపొర అనుపమ దృష్టిని దాటిపోలేదు.

స్పందన చెప్పడం మొదలుపెట్టింది. ''రాజేష్ అందానికి పడిపోయిన నేను అమ్మానాన్నలకి చెప్పకుండా ఇంట్లోంచి పారిపోయి రాజేష్‌ని పెళ్లిచేసుకున్నాను. శారీరక లోపాలనే చూసిన నేను అతడి మానసిక లోపాన్ని కనిపెట్టలేకపోయాను. అందుకు ఫలితం అనుభవిస్తున్నాను. అనూ! రాజేష్‌కి లేడీస్ వీక్‌నెస్. ఏ భర్తకీ ఉండకూడని లోపం.

## బాధపడకూడదు

**'జీవితంలో ఏం జరిగినా మన మంచికే. ఒక సినిమా సక్సెస్ అయితే ఆ స్ఫూర్తితో మరో నాలుగు సినిమాల్లో నటిస్తాం. అలాంటిది ఒక సినిమా ఫ్లాప్ అయితే ఆ ప్రభావం తరువాత సినిమాలపై పడుతుంది. ఏది ఏమైనా మనం బాధపడడం అనేది తల్లిదండ్రుల నుంచి వస్తుంది. నా తండ్రి జీవితం గురించి నాకు బాగా బోధించారు' అంటోంది రాణీముఖర్జీ. ఈమధ్యకాలంలో ఆమె నటిస్తున్న సినిమాలు హిట్ అవుతుండడంతో ఇలాంటి వ్యాఖ్యానాలు ఎన్నో చేస్తోంది. పత్రికల వారితో చాలా క్లోజ్‌గా మూవ్ అవుతోంది. తండ్రి సినిమా రంగంనుంచి రావడంతో ఆ నటన ఈమెకి కూడా బాగా వంటబట్టినట్టుంది.**

ఈ భూమ్మీద ఏ భార్యా సహించలేని లోపం. రాజేష్ బార్‌లకెళతాడు. అమ్మాయిలతో గడుపుతాడు. కానీ అసలు చిత్రం ఏమిటంటే తను చేసేవన్నీ తప్పులని అతడు అనుకోడు. హైక్లాస్ సొసైటీలో ఇవన్నీ కామన్ అంటాడు. అదే కల్చర్ అంటాడు. ఇప్పుడు చెప్పు నేను అదృష్టవంతురాలినేనా'' అన్నది స్పందన.

''ఏమిటోనే నీది ఒక రకం బాధైతే నాది ఇంకో రకం. బాంక్ ఆఫీసర్ని పొందిన అదృష్టవంతురాలినన్నావు. నా అదృష్టం ఏపాటిదో మా ఆయనని చూస్తేకానీ తెలీదు నీకు'' అన్న అనుపమ మాటలకి-

''ఏమిటే కొంపదీసి మీవారికి కూడా ఇలాంటి అలవాట్లు ఉన్నాయా?'' అన్నది స్పందన.

''ఛ..ఛ.. ఆయనకి తెలిసిందల్లా ఆఫీసూ, ఇల్లూ. కానీ ఆయన అసలు బాగుండరు. ఆయన సమక్షం నాకు సంతోషాన్నివ్వదు. ఆయన స్పర్శ నాలో ఏ స్పందనలూ కలగచేయదు. ఈ సంగతి బయటకి చెప్పి ఆయనని బాధపెట్టలేక మనసులోనే అణచుకుని రాజీ పడలేక రోజూ నరకం అనుభవిస్తున్నాను''



స్పందన ఒక్క క్షణం మౌనంగా వుండి నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టింది-

''చూడు అనూ! ఏ జంటనైనా పెళ్లయిన మొదటి పదేళ్లలో బాహ్యసౌందర్యం కలిపి వుంచుతుంది. ఆ తర్వాత జీవితపు చివరి మజిలీ వరకూ వారిద్దరినీ తోడూ నీడగా కలిపి ఉంచేది ప్రేమ మాత్రమే. ఆ ప్రేమ మాత్రం బాహ్యసౌందర్యం వల్ల పుట్టదు. ఆ ప్రేమని అందించేది అంతఃసౌందర్యం మాత్రమే. నువ్వు చెప్పినట్టు బాహ్యసౌందర్యమే ప్రధానం అనుకుంటే సినిమాల ప్రభావం వల్ల పైపై మెరుగులకే ఆకర్షించబడి చేసుకునే ప్రేమ పెళ్లిళ్లు ఎందుకు విఫలమవుతున్నాయి? నువ్వు చెప్పినట్టు అందమే ప్రధానం అనుకుంటే ముసలి వయసులో అందం హరించుకుపోయాక భార్యాభర్తలు ఒకరినొకరు ద్వేషించుకోవాలి. కానీ అలా జరుగుతోందా ఎక్కడైనా? ఇంకా చెప్పాలంటే ఆ వయసులోనే ఒకరిమీద ఒకరికి ప్రేమ ఎక్కువవుతుంది. నీ భర్త బాంక్ ఆఫీసర్ హోదాలో ఉండి కూడా కట్నం లేకుండా ఏరికోరి నిన్నే ఎందుకు చేసుకున్నాడు? అందుకు కేవలం నీ అందమే కారణం అంటే నేను ఒప్పుకోను. మీ ఇంటి పరిస్థితులకి జాలిపడి కూడా చేసుకున్నాడని ఎందుకనుకోవు. ఎదుటి మనిషిలోని పాజిటివ్ పాయింట్స్ గురించి ఆలోచించు. నీ జీవితం హ్యాపీగా గడుస్తుంది. అయినా అతడు నీకు నచ్చకపోతే ఆ సంగతి పెళ్లికి ముందే ఎందుకు చెప్పలేదు? అప్పుడు పరిస్థితులకి తలవంచి తాళి కట్టించుకుని, ఇప్పుడు అతడి సుఖసంతోషాలని దూరం చేసే హక్కు నీకు లేదు. అనూ! నువ్వేమనుకోనంటే ఒకటి అడుగుతాను. రాజేష్ లాంటి భర్త నీకు దొరికితే ఏం చేస్తావు? అందమైన అతని ముఖం చూస్తూ అతడి స్త్రీ బలహీనతని క్షమించగలవా?'' అన్న స్పందన మాటలకి ఉలిక్కిపడింది అనుపమ. ఒక్కసారిగా అతని చూపులు గుర్తొచ్చి ఒళ్లంతా కంపరంగా అనిపించింది. 'వద్దు.. వద్దు అలాంటి భర్త మేడిపండులాంటి ఆ కాపురం తనకి జన్మజన్మలకీ వద్దు' అనుపమ అంతరాత్మ గళం విప్పింది. అనుపమ మనసు చదివిన స్పందన నవ్వింది.

★ ★ ★

''ఏమండీ ఆఫీసు నుంచి సాయంత్రం త్వరగా వచ్చేయండీ! ఇద్దరం సినిమాకి వెళదాము. ఆ.. అన్నట్టు వచ్చేటప్పుడు మల్లెపూలు తెస్తారు కదూ'' అన్న అనుపమ వంకే 'ఇది కలా నిజమా' అన్నట్టు చూస్తూ నిలబడిపోయాడు ప్రశాంత్.

✤